# పెండింగ్ పనులు పూర్తిచేయుటకు చర్యలు తీసుకోండి..

- మౌళిక సదుపాయాలను యుద్ధ ప్రతిపాదికతన పూర్తి చేయించాలి
- కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి
- జిల్లా కలెక్టరు ప్రియాంకా అలని కలిసిన మున్సిపల్ కౌన్సిల్, బిఆర్ఎస్ నాయకులు
- సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్



**కొత్తగూడెం, డిసెంబర్15(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పెండింగ్ పనులు పూర్తిచేయుటకు చర్యలు తీసుకోవాలని, వార్డుల్లో మౌళిక సదుపాయాలను యుద్ధ ప్రతిపాదికతన పూర్తి చేయించాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి కోరారు. కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆద్వర్యంలో పురపాలక సంఘ వైస్ చైర్ పర్సన్ వేల్పుల దామోదర్, బిఆర్ఎస్ వార్డు కౌన్సిలర్, కొత్తగూడెం బిఆర్ఎస్ పార్టీ నాయకులు కలెక్టరు కార్యాలయము నందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరు ప్రియాంకా అలని మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగూడెం పురపాలక సంఘములో వివిధ గ్రాంటుల ద్వారా చేపట్టుచున్నటువంటి వర్కులలో ప్రస్తుతము కొన్ని వర్కులు పెండింగ్‌లో ఉన్నాయని, మరికొన్ని వర్కులు కౌన్సిల్ ఆమోదం పొంది టెండరు ప్రక్రియ పూర్తీ కాలేదని, 36 వార్డులలో మంచినీటి సమస్య ఏర్పడకుండా ఉండుటకు గాను వార్డుకు రూ.2.00 లక్షలను కౌన్సిల్ ఆమోదం తెలిపియున్నారని అట్టి పనులను, పలు అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాలను యుద్ధ ప్రతిపాదికతన పూర్తీ చేయుటకు గాను తగు చర్యలు తీసుకోనవలసినదిగా కోరారు. ఇట్టి విషయమై పట్టణ సమస్యలను, అభివృద్ధి పనులను త్వరగతిన పూర్తీ చేయుటకు గాను జిల్లా కలెక్టరు సానుకూలంగా స్పందించారని కాపు సీతాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్ పర్సన్ వేల్పుల దామోదర్, బిఆర్ఎస్ వార్డు సభ్యులు కొలపురి ధర్మరాజు, పరమేష్ యాదవ్, వేముల ప్రసాద్, అంబుల వేణు గోపాల్, బండి నరసింహారావు, రుక్మధర్ బండారి, వై.శ్రీనివాస రెడ్డి, బలిసేట్టి సత్యభామ, గుమ్మడేల్లి కల్యాణి, కూరపాటి విజయ లక్ష్మి, కొత్తగూడెం పట్టణ బిఆర్ఎస్ నాయకులు యూసుఫ్, బలసేట్టి సుందర్ రాజ్, మధ శ్రీరాములు, మోరె రమేష్, గుమ్మడేల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.





# ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఆటో డ్రైవర్లకు జీవనభృతి చెల్లించాలి
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

**కొత్తగూడెం, డిసెంబర్15(కెరటం ప్రతినిధి)**

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని,వారికి జీవనభృతి చెల్లించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన బహుజన కార్మిక విభాగం జిల్లా సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నూతన రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వలన ఆటో కార్మికులు ఆటోలను నడపలేక కనీసం కిస్తీలు కూడా కట్టలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారనీ,వేలాది ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాల నుంచి డ్రైవర్లకు కనీస వేతన జీవో విడుదల చేయలేదని గుర్తు చేశారు.డ్రైవర్లకు కనీస వేతనం జీవో 25 విడుదల చేయాలని,ట్రాఫిక్ చాలన్లు రద్దు చేయాలని,ప్రతీ ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి రూ.15,000 ఆర్థిక సహాయం అందచేయాలని,ఏ షరతులు లేకుండా డ్రైవర్లకు రూ.10 లక్షల భీమా అమలు చేయాలన్నారు. రవాణా వాహనాలపై సింగిల్ పర్మిట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన కార్మిక విభాగం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సాయి, చేనిగారపు నిరంజన్ కుమార్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,పట్టణ అధ్యక్షుడు వంగా రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు



## మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల

**హైదరాబాద్, డిసెంబర్15(కెరటం ప్రతినిధి)**

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావుతో పాటు పాల్వంచ మాజీ జెడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాలినేని నాగేశ్వరరావు లు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని పొంగులేటి నివాసంలో ఆయనను కలిసి కొత్తగూడెం నియోజవర్గం అభివృద్ధిపై చర్చించారు.



## కిన్నెరసాని పథకం కార్మికులకు అండగా ఉంటాం

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**కొత్తగూడెం, డిసెంబర్15(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం పట్టణానికి త్రాగునీరందిస్తున్న కిన్నెరసాని నీటి ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యల పరిస్కారానికి కృషి చేస్తామని, కార్మికులకు కమ్యూనిస్ట్ పార్టీ అండగా ఉంటుందని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా స్పష్టం చేశారు. సుదీర్ఘకాలంగా ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు శ్రమిస్తున్నారని, వీరికి అధికారులు శ్రమకుతగిన వేతనం సకాలంలో అందించాల్సిన అవసరం ఉందన్నారు. కనీస వేతనాలు, చట్టపరమైన హక్కులు అమలయ్యేవిదంగా అధికారులపై వత్తిడి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గెడ్డాడు నగేష్, కార్మికులు పాల్గొన్నారు.



## ఏడబ్ల్యుఎస్ సహాయంతో పునర్నిర్మించిన తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ ప్రారంభం

**హైదరాబాద్, డిసెంబర్15(కెరటం ప్రతినిధి)**

అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యుఎస్) ఇన్‌కమ్యూనిటీస్ ప్రోగ్రామ్‌లో భాగంగా రంగారెడ్డి జిల్లా షాబాద్‌లోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ (టీఎస్ఎంఎస్) పునరుద్ధరణ, సుందరీకరణ పనులు పూర్తి చేశారు. ఈ భవనాన్ని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ అదనపు డైరెక్టర్ రమణ కుమార్, రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి పీ సుశీంద్ర రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీఎల్ అనురాధ, ఏ డబ్ల్యు ఎస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైఎస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్ సమక్షంలో ప్రారంభించారు. ఈ పాఠశాల పునర్నిర్మాణంలో విద్యుత్, ప్లం బింగ్ ఇతర పనులు ఉన్నాయి. పిల్లల కోసం పాఠశాల గోడలపై రంగులతో వేసిన చిత్రాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. లైబ్రరీతో పాటు తరగతి గదులలో కొత్త ఫర్నిచర్ కూడా ఉంది. తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్లో 20 గ్రామాల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు షాబాద్ లోని ఈ స్కూల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఈ రెసిడెన్షియల్ స్కూల్లోనే ఉంటున్నారు.